# సమగ్రంగా... స్పష్టంగా!

**ఒక అంశంపై సమాచారాన్ని సేకరించాక దాన్ని అధ్యయనం చేయాలి. అడిగిన ప్రశ్నకు అనుగుణంగా దాన్ని నిర్దేశించిన పదాల్లో సమగ్రంగా, స్పష్టంగా రాయటం అసలు సవాల్. దీనికి మార్గం... సాధన చేయటమే!**

## అధ్యయనం 6

'రైతులకు జాతీయ, రాష్ట్ర స్థాయుల్లో ఇస్తున్న వివిధ రకాల వ్యవసాయ సబ్సిడీలు, వాటి ప్రభావాన్ని అవి సృష్టించిన అపభ్రంశాల నేపథ్యంలో విమర్శనాత్మకంగా విశ్లేషించండి'- ఈ ప్రశ్నకు ఎలా సమాధానం రాయొచ్చు?



నూతక్కి విజయశేఖర్

ఇక్కడ ఇస్తున్న వివరణ పరీక్షల్లో ఉన్నది ఉన్నట్లు ఇవ్వడానికి కాదు. దాని నుంచి సమాధానాన్ని క్లుప్తీకరించుకునే పని అభ్యర్థులు ఎవరి పద్ధతిలో వారు చేసుకోవాల్సిందే!

## జీవనస్థాయి వృద్ధికి...

ఉత్పత్తి ఖర్చుకూ, కొనుగోలు శక్తికీ మధ్య అంతరాన్ని పూడ్చడానికి ప్రభుత్వాలు సబ్సిడీ ఇస్తాయి. స్థూల ఆర్థిక పరిభాషలో సబ్సిడీ చెల్లింపు అనేది ప్రభుత్వాల చేతుల్లో ఉండే కోశాగార విధాన సాధనం కూడా. దేశంలోని ప్రజల మధ్య తీవ్ర ఆదాయ అంతరాలు ఉండటం వల్ల సబ్సిడీలు ఇవ్వడం ప్రభుత్వాల కర్తవ్యం. వినియోగం పెరిగి తద్వారా జీవనస్థాయి వృద్ధి చెందడానికి ఇవి తోడ్పడతాయి. అయితే సామాజిక, పాలనా వ్యవస్థల్లోని లోపాల వల్ల లక్షిత ప్రజలకు చేరకుండా ఇవి దారి తప్పుతున్నాయి. దానివల్ల అనుకున్న ప్రయోజనం నెరవేరకపోగా ఆర్థిక వ్యవస్థలో అపభ్రంశాలు ఏర్పడుతున్నాయి.

ప్రశ్నలోని మొదటి భాగం చూస్తే- వ్యవసాయ సబ్సిడీలు ప్రధానంగా రెండు రకాలు. 1. ఇన్‌పుట్ సబ్సిడీలు 2. ఉత్పత్తి ధరల మద్దతు రూపంలో ఇచ్చే సబ్సిడీలు. ఈ రెండిటిలోనూ నేరుగా వినియోగదారులకు ఇచ్చే ప్రత్యక్ష సబ్సిడీలు; సంస్థలకు పన్ను రాయితీలు, ఉచిత భూములు, రుణాలు ఇవ్వడం ద్వారా ఉత్పత్తి ఖర్చును తగ్గించేందుకు ఇచ్చే పరోక్ష సబ్సిడీలూ ఉన్నాయి.

కేంద్రం ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీలు ప్రధానంగా ఎరువులు. రాష్ట్రాలు ఇచ్చేవి విత్తనాలు, పురుగుమందులు, ఉచిత విద్యుత్తు మొదలైనవి. రుణాల రద్దుకు రాష్ట్రప్రభుత్వం నిర్ణయించి ఆ మొత్తాన్ని తానే బ్యాంకులకు చెల్లిస్తే ఆ సబ్సిడీ రాష్ట్రం భరించినట్టు. ఆర్‌బీఐ ద్వారా దేశవ్యాప్తంగా రీషెడ్యూల్ చేయిస్తే అది కేంద్రం ఖాతాలోకి వస్తుంది.

కేంద్రం అమలుచేసే గిట్టుబాటు ధరలు, ఆహార భద్రతా పథకం, ప్రజాపంపిణీ వ్యవస్థ, ఎగుమతి రాయితీలు/ప్రోత్సాహకాలు... ఇవన్నీ రెండో తరహా సబ్సిడీలు.

పంపిణీ పద్ధతిని బట్టి సబ్సిడీలు వివిధ రకాలు. ప్రత్యక్ష చెల్లింపులు (నగదు బదిలీ పథకం), పన్ను రాయితీలు (కంపెనీలకు ఇచ్చేవి), ప్రజాపంపిణీ వ్యవస్థ, క్రాస్ సబ్సిడీలు (ఒక రంగంలో మిగులు మరో రంగంలో ఖర్చుకు వినియోగించడం), క్రెడిట్ సబ్సిడీలు (పంటల బీమా, రుణమాఫీ, కంపెనీల ఉత్పత్తులకు ఇచ్చే గ్యారంటీ...), మార్కెట్ మద్దతు (గిట్టుబాటు ధరలు), హైబ్రిడ్ సబ్సిడీలు (పర్యావరణాన్ని కాపాడే లక్ష్యంతో సేంద్రియ ఎరువుల వాడకానికి ప్రోత్సాహకాలు...).

సబ్సిడీల ప్రధాన ఉద్దేశం- ఉత్పత్తిదారుల ఖర్చులకూ, వినియోగదారుడిద కొనుగోలు శక్తికీ అంతరాన్ని పూడ్చి వ్యవసాయోత్పత్తుల అమ్మకాలనూ, వినియోగదారుల కొనుగోళ్ళనూ ప్రోత్సహించటం. తద్వారా బలహీనవర్గాల ప్రజల డబ్బును ఇతర అవసరాలకు మిగిల్చి ఇతరత్రా వినియోగం పెంచి జీవనస్థాయుల్లో అంతరాన్ని తగ్గించడం.



## పంపిణీలో లోపాలు

రైతులతో పాటు పురుగుమందులు, విత్తనాలు ఉత్పత్తి చేసే కంపెనీలు కూడా ఉత్పత్తిదారులే. రైతుల్లో కూడా చిన్న, సన్నకారు రైతులనుంచి బడా భూస్వాముల వరకూ ఉన్నారు. ప్రభుత్వాలు ఇచ్చే సబ్సిడీలు వివిధ రూపాల్లో వీరందరికీ అందుబాటులో ఉంటాయి. ఈ రకంగా ఇవి లక్షిత ప్రజలకు బదులు కలిగిన వర్గాలకు ఎక్కువగా చేరుతున్నాయి. ఫలితంగా అంతరాలు తగ్గడం అటుంచి ఆదాయ కేంద్రీకరణ ఇంకా పెరుగుతోంది. ఇది ప్రధాన అపభ్రంశం. పంపిణీ వ్యవస్థ (డెలివరీ సిస్టం) లోపాలను సవరించాలని ప్రధాన మంత్రులు, ఆర్థిక మంత్రులు ఎన్నోసార్లు చెప్పినా అవి కొనసాగుతున్నాయి.

ఈ ప్రధాన అపభ్రంశం మరిన్ని అపభ్రంశాలకు దారితీస్తోంది. తలసరి సబ్సిడీ పెరుగుతున్న దామాషాలో ఆదాయ అంతరాలు తగ్గడం లేదు. లక్షిత వర్గాల్లో తలసరి వినియోగం పెరగడం లేదు. వ్యవసాయ సబ్సిడీలు పెరుగుతూ పోవడం వల్ల నీటిపారుదల కాల్వలు, ప్రాజెక్టులు తదితర మౌలిక సౌకర్యాలకు పెట్టుబడి లోపిస్తోంది. అంటే వ్రతమూ చెడుతోంది; ఫలితమూ దక్కడం లేదు.

కనీస మద్దతు ధర, ప్రజా పంపిణీ వ్యవస్థలు రెండూ రెండు విరుద్ధ లక్ష్యాలను నెరవేర్చాలి. మొదటిది రైతులకు అధిక ధర ఇవ్వాలి. రెండోది పేదలకు సరసమైన ధరలకు ఆహారం ఇవ్వాలి. కనీస మద్దతు ధర ధనిక రైతులకు చేరుతుండగా పంపిణీ వ్యవస్థలో లీకేజిలు, నిర్వహణ లోపాలు పేదవర్గాలకు ప్రజాపంపిణీని చేరనీయడం లేదు. దీంతో సబ్సిడీలతో పాటు ప్రజాపంపిణీ వ్యవస్థపై పెట్టే పాలనా ఖర్చు వృథా అవుతోంది.

పంజాబ్, హర్యానా లాంటి ధనిక రాష్ట్రాలు జనాభా దామాషాలో ఎక్కువ సబ్సిడీ పొందుతుండగా యూపీ, బీహార్, ఎంపీ లాంటి వెనకబడినవి తక్కువ సబ్సిడీ పొందుతున్నాయి. విద్యుత్ వినియోగం, సబ్సిడీల్లోనూ ఇదే పరిస్థితి. వినియోగదారుడు, రైతుల మధ్య ఉన్న దళారీ వ్యవస్థలను నిర్మూలిస్తే వ్యయాన్ని తగ్గించుకోవచ్చు. ఇరువురూ లబ్ధి పొందవచ్చు. అధిక సబ్సిడీలు ఇచ్చినా లక్షిత వర్గాలకు చేరనందున సూక్ష్మ ఆర్థిక వ్యవస్థలో అపభ్రంశాలు చోటుచేసుకుంటున్నాయి.

అంతిమంగా అర్థమయ్యేది- సబ్సిడీల లక్ష్యంలో లోపం లేదు. అసమాన, అంతరాల వ్యవస్థల్లో ఇవి అనివార్యం. కేవలం పంపిణీలోనే అసలు లోపముంది. ప్రభుత్వంపై వ్యయాన్ని తగ్గించి వ్యవసాయ మౌలిక సౌకర్యాలకు అవసరమైన ఉత్పాదక పెట్టుబడిని పెంచాలంటే పంపిణీలోని లోపాలను సవరించాలి.

**ఈ తరహా సమాచారాన్ని ఆకళింపు చేసుకుని నిర్దేశించిన 200 పదాల్లో సమగ్రంగా రాయటం సాధన చేయాలి.**

రచయిత 'జాతీయ అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణ' సైట్ *www.teluguvartalu.com* నిర్వాహకులు.